క్లుప్తంగా

జెడ్పీటీసీ విరాళం

ఖానాపూర్: పట్టణంలోని శ్రీరాంనగర్ కాలనీలోని శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయానికి శనివారం పెంబి జెడ్పీటీసీ జానుబాయి రూ.10వేల విరాళం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జానుబాయిని సన్మానించారు. నాయిని సంతోష్, గుమ్ముల రాజేందర్, చంద్రహాస్, పసుపుల నరేందర్, రమేశ్, జలేందర్ గుప్త, కన్నయ్య, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

సర్టిఫికెట్ల అందజేత

భైంసాటౌన్: పట్టణంలోని జీఆర్‌పీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్స్ ఆధ్వర్యంలో మూడు నెలల కోర్సు పూర్తి చేసుకున్న పలువురు విద్యార్థులకు శనివారం సర్టిఫికెట్లు అందించారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ సుధాకర్, ఇంపాక్ట్ సర్టిఫికెట్ ట్రైనర్ వాడేకర్ లక్ష్మణ్, ఎకనామిక్స్ విభాగం హెచ్ఓడీ సరస్వతి, ఆర్పీ అంజాద్‌షేక్ తదితరులు ఉన్నారు.

జీతాలు పెరగాలని పూజలు



పూజలు చేస్తున్న వీవోఏలు

లోకేశ్వరం: తమ జీతాలు పెరగాలని ఐకేపీ వీవోఏలు మండలంలోని బాగాపూర్ లక్ష్మీ నారాయణస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కనీస వేతనం నెలకు రూ.26 వేలు, రూ.పది లక్షల బీమా, హెల్త్‌కార్డులను అందించాలని కోరారు. అర్హులైన సీఏలకు సీసీలుగా ప్రమోషన్లు ఇవ్వాలన్నారు. నాయకులు సంగీత, గంగాధర్, పోశెట్టి, సాయన్న, శ్రీనివాస్, రాములు, నారాయణ, మల్లేశ్, గంగన్న, సునీత ఉన్నారు.

బస్టాండ్‌లో ఫ్రిడ్జ్ ఏర్పాటు

నిర్మల్‌టౌన్: ఆర్టీసీ ఎండీ సజ్జనార్ ఆదేశాల మేరకు ప్రయాణికుల కోసం నిర్మల్ బస్టాండ్‌లో 120 లీటర్ల సామర్థ్యం కలిగిన ఎలక్ట్రికల్ ఫ్రిడ్జ్‌ను ఏర్పాటు చేశారు. ఈమేరకు శనివారం డిపో మేనేజర్ సాయన్న ప్రారంభించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజర్ ఐ.రాజశేఖర్, కంట్రోలర్లు శ్యాంసుందర్, కే.ఎం.రెడ్డి, డి.గంగన్న తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న సురేశ్

మామడ: అంగన్‌వాడీ టీచర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సురేశ్ అన్నారు. శనివారం మండలంలోని పొన్కల్ గ్రామంలో అంగన్‌వాడీ టీచర్ల సమావేశంలో పాల్గొన్నారు. ఖానాపూర్ ఐసీడీఎస్ సీడీపీవో అంగన్‌వాడీ టీచర్ల నుంచి ప్రతి నెల వసూళ్లతో అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. అధికారులు విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పలువురు అంగన్‌వాడీ టీచర్లు రమ, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ బడ్జెట్ ఆమోదం

ఖానాపూర్: ఖానాపూర్ పట్టణంలో 2023–24లో మున్సిపల్ వార్షిక బడ్జెట్ ఆమోదం పొందిందని కమిషనర్ రత్నాకర్‌రావు తెలిపారు. శనివారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. శుక్రవారం ఖానాపూర్ మున్సిపల్ కార్యాలయంలో జరిగిన వార్షిక బడ్జెట్ సమావేశ వివరాల నివేదికను కలెక్టర్ వరుణ్‌రెడ్డికి అందించగా ఆమోదం తెలిపినట్లు పేర్కొన్నారు. ఆమోదం పొందిన బడ్జెట్‌ను హైదరాబాద్‌లోని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులకు పంపినట్లు వివరించారు.

పశువులను రోడ్లపైకి రానివ్వొద్దు

ఖానాపూర్: పశువులను రోడ్లపైకి రాకుండా కట్టడి చేయాల్సిన బాధ్యత యజమానులదేనని మున్సిపల్ కమిషనర్ రత్నాకర్‌రావు అన్నారు. శనివారం పట్టణంలో పలు రోడ్లపై ఉన్న పశువులను వాహనాల్లో శివారు ప్రాంతంలోకి మున్సిపల్ సిబ్బంది తరలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. పశువులను యజమానులు తీసుకెళ్లాలని.. రోడ్లపైకి వస్తే మున్సిపల్‌శాఖ ఆధ్వర్యంలో గోశాలకు తరలిస్తామని హెచ్చరించారు.

ఘనంగా పడిపూజ

కుంటాల: మండల కేంద్రం కుంటాల సురేష్ హనుమాన్ స్వామి ఆధ్వర్యంలో శనివారం ఘనంగా అంజన్న మహా పడిపూజను నిర్వహించారు. గురు స్వామి భుజంగం గణపతి ఆధ్వర్యంలో 18 పడిమెట్ల పూజ, అంజన్న పంచామృతంతో అభిషేకం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

హలీంకు సలాం



హలీం

- పట్టణాల్లో ప్రత్యేక స్టాళ్లలో విక్రయాలు
- అందుబాటులో తీరొక్క రుచులు
- ఆసక్తి కనబరుస్తున్న భోజన ప్రియులు

నిర్మల్‌చైన్‌గేట్: పవిత్రమైన రంజాన్ మాసం వచ్చిందంటే చాలు.. నెల రోజుల పాటు ముస్లింల ఉపవాస దీక్షలు, మసీదుల్లో ప్రార్థనలతోపాటు కాదు. ఆరోగ్యాన్ని ప్రసాదించే హలీం సందడి మొదలవుతుంది. రుచి చూసిన వారెవరైనా దీనికి సలాం చెప్పాల్సిందే. ఒకప్పుడు హైదరాబాద్ నగరానికే పరిమితమైన ఈ సంప్రదాయక వంటకం తయారీ కేంద్రాలు.. ప్రస్తుతం చిన్న పట్టణాలకు సైతం విస్తరించాయి. దీంతో రోజు సాయంత్రమైతే తయారీ కేంద్రాలు కొనుగోలుదారులతో కిటకిటలాడుతాయి. రంజాన్ మాసం సందర్భంగా హలీం తయారీ కేంద్రాలపై ప్రత్యేక కథనం.

ప్రజల ఆసక్తి..

నిర్మల్‌లో రంజాన్ ప్రార్థనలకు వచ్చే ముస్లింలకు అందుబాటులో ఉండేలా మంజులపూర్ సమీపంలోని పాలిమేర హోటల్, మార్కెట్‌లోని మసీదు సమీపంలో, పాత బస్టాండ్ ఏరియాలో, భైల్‌బజార్‌లో, ఎన్టీఆర్ మినీ స్టేడియం ఎదురుగా, కలెక్టరేట్ ఎదురుగా, ఐఎఫ్‌సీ హోటల్, గ్రిల్ 99, ఈద్‌గాం చౌరస్తాతోపాటు జిల్లాలో మొత్తం 20కి పైగా హలీం కేంద్రాలను ఏర్పాటు చేశారు. వీటిల్లో రుచికరమైన చికెన్‌హలీం రూ.100కు, మటన్ హలీం రూ.150కు లభిస్తోంది. సాయంత్రం 5 గంటల నుంచి రాత్రి 10 గంటలవరకు అమ్మకాలు జరుగుతున్నాయి. హలీం రుచికే కాదు. ఆరోగ్యానికి ఎంతో మంచిది. ఇందులోని పోషకాలు శరీరానికి మేలు చేస్తాయి. ఒక కప్పు హలీంలో 365 క్యాలరీలు, కొవ్వు నుంచి లభించే క్యాలరీలు 150 లభిస్తాయి.

- భైంసా పట్టణంలో బస్టాండ్ ఏరియా, పంజేశా కాలనీలో ఐదు హలీం సెంటర్లు ఏర్పాటు చేశారు. ఒక బాక్స్ రూ.100 నుంచి రూ.150 వరకు విక్రయిస్తున్నారు.
- ఖానాపూర్‌లో బస్టాండ్ ఏరియా, యూబీఐ బ్యాంకు ఎదురుగా, ఎన్టీఆర్ కూడలిలో హలీం సెంటర్లు ఏర్పాటు చేశారు.

తయారీ ప్రత్యేకమే..



నిర్మల్‌లో హలీం తయారీ విధానం

అరబ్ దేశమైన పర్షియా నుంచి హైదరాబాద్ వచ్చిన హలీం తయారీ ఆద్యంతం ప్రత్యేకమే. దీని తయారీకి కనీసం 9 గంటలు పడుతుంది. ఇందులో మటన్ లేదా చికెన్, గోధుమలు, అన్ని పప్పులు, బాస్మతి బియ్యం, నెయ్యి, అల్లంవెల్లుల్లి పేస్ట్, ఉల్లిగడ్డ, పచ్చిమిర్చి, యాలకులు, దాల్చినచెక్క, మిరియాలు, కొత్తిమీర, నూనె, డ్రైఫ్రూట్స్ తదితర వస్తువులను వినియోగిస్తారు. ముందుగా గిన్నెలో మాంసం, నీటిని కలిపి బాగా ఉడికిస్తారు. అనంతరం గోధుమలు, బాస్మతిబియ్యం, పప్పులు, అల్లంవెల్లుల్లిపేస్ట్, మసాలా దినుసులు, పచ్చిమిర్చి బాగా ఉడికించి మెత్తగా దంచుతారు. సమపాళ్లలో నెయ్యి కలుపుతారు. వేయించిన ఉల్లిపాయలు, నిమ్మ ముక్కతో పింగాణీ ప్లేటులో వడ్డిస్తారు. చికెన్ హలీంను హరీస్‌గా పిలుస్తారు.



చాలా బాగుంది



గతంలో హలీం తినాలంటే హైదరాబాద్ నుంచి తెప్పించుకునేవాళ్లం. ప్రస్తుతం నిర్మల్‌లో తయారు చేస్తున్న హలీం రుచి బాగుంది. ఆరోగ్యానికి మేలు చేసేది కావడంతో రోజు స్నేహితులతో వచ్చి ఇష్టంగా తింటున్నాం.

– అబ్దుల్ ముఖీద్, నిర్మల్

క్వాలిటీలో రాజీపడం



భోజన ప్రియుల అంచనాలకు తగ్గట్టుగా హలీం తయారు చేస్తేనే ఆదరణ ఉంటుంది. అందుకే రెండేళ్లుగా రాజీపడకుండా రంజాన్ మాసంతోపాటు సాధారణ రోజుల్లో ప్రతి శుక్రవారం నాణ్యమైన హలీం తయారు చేస్తున్నా. ఇప్పుడిప్పుడే పట్టణ ప్రజలు దీనిని ఆహారంగా తీసుకునేందుకు ఆసక్తి కనపరుస్తున్నారు.

టి.నగేశ్, పాలిమేర రెస్టారెంట్ చెఫ్, నిర్మల్

శక్తివంతమైన ఆహారం



హలీం శక్తివంతమైన ఆహారం. మాంసంతో పాటు అనేక రకాల పప్పుదినుసులతో తయారు చేయడం వల్ల ప్రొటీన్లు, విటమిన్లు ఎక్కువగా ఉంటాయి. చెక్క, లవంగాలు, ఉల్లిపాయలు ఉండటం వల్ల రోగనిరోధక శక్తిని పెంచుతుంది. రంజాన్ మాసంలో ఉపవాసం ఉన్న వారికి హలీం మంచి శక్తినిస్తుంది.

– షఫీక్ అహ్మద్, హలీం తయారీదారు సంఘం హోటల్, నిర్మల్

‘పది’ పరీక్షలకు ఏర్పాట్లు

లోకేశ్వరం: మండల కేంద్రంలో సోమవారం నుంచి ప్రారంభమయ్యే పదో తరగతి పరీక్షలకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు లోకేశ్వరం జెడ్పీ పాఠశాల డీవో నర్సయ్య, చీఫ్ సూపరిటెండెంట్ కిషన్‌రావు న్నారు. సోమవారం మండల కేంద్రంలోని జెడ్పీ ఉన్నత పాఠశాల, జూనియర్ కళాశాలలో ఏర్పాట్లు పరిశీలించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాలలో 114 మంది విద్యార్థులు, ఏడుగురు ఇన్విజిలేటర్లు, జెడ్పీ పాఠశాలలో 160 మంది విద్యార్థులు, తొమ్మిది మంది ఇన్విజిలేటర్లు, ఇద్దరు డిపార్ట్‌మెంట్ అధికారులను నియమించినట్లు వారు పేర్కొన్నారు. ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేశ్‌కుమార్, డీవో తిరుమలరెడ్డి, సీఎస్ సునీల్‌రెడ్డి ఉన్నారు.

ముధోల్: ముధోల్ మండల కేంద్రంలోని నాలుగు పరీక్ష కేంద్రాల్లో 720 మంది విద్యార్థులు, బాసర మండలంలోని రెండు పరీక్ష కేందాల్లో 280 మంది పరీక్షలు రాయనున్నట్లు ఎంఈవో మైసాజీ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు.

నర్సాపూర్(జి): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో 192 మంది పరీక్ష రాయనున్నట్లు చీఫ్ సూపరింటెండెంట్ నాగన్న, డిపార్ట్‌మెంటల్ అధికారి లతాంబర్ తెలిపారు. శనివారం పరీక్ష కేంద్రాలను తహసీల్దార్ శ్రీకాంత్ పరిశీలించి ఇన్విజిలేటర్లకు సూచనలు చేశారు. 11 మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. పరీక్షా కేంద్రం వద్ద 144 సెక్షన్ అమల్లో ఉంటుందని ఎస్సై గీత పేర్కొన్నారు. గిర్దావర్ వేణుగోపాల్ ఉన్నారు.



ఎల్వి కేంద్రంలో ఏర్పాట్లు చేస్తున్న అధికారులు

తానూరు: తానూరు, ఎల్వి, భోసి గ్రామాల్లోని పరీక్ష కేంద్రాల్లో 439 మంది పరీక్షలు రాయనున్నట్లు ఎంఈవో సుభాశ్ తెలిపారు. విద్యార్థులకు ఇబ్బంది కలకుండా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. శనివారం తానూరు పాఠశాలలో ఏర్పాట్లను తహసీల్దార్ వెంకటరమణ పరిశీలించారు. వారి వెంట ఆర్ఐ గంగాధర్, పీఎస్‌లు విశ్వనాథ్ అప్పా, గంగాధర్, డీవోలు భూమన్నయాదవ్, రాజు ఉన్నారు.



నర్సాపూర్(జి) ఇన్విజిలేటర్లతో తహసీల్దార్

కుంటాల: మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో 219మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నట్లు చీఫ్ సూపరింటెండెంట్ మధుకర్‌రావు, డీవో రాజేందర్ తెలిపారు. 12మంది ఇన్విజిలేటర్లను నియమించామన్నారు. శనివారం ఏర్పాట్లను ఎంఈఓ ముత్యం పరిశీలించారు.

హాల్ టికెట్లు అందించిన తహసీల్దార్

దస్తురాబాద్: మండల కేంద్రంలోని కేజీబీవీని శనివారం తహసీల్దార్ లక్ష్మి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె పదో తరగతి విద్యార్థినులకు హాల్‌టికెట్లు అందించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. అంతకుముందు వంటగదిని పరిశీలించి పలు సూచనలు చేశారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

భైంసారూరల్: పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఎంపీపీ కల్పన అన్నారు. శనివారం మండలంలోని వానల్‌పాడ్, లింగా గ్రామాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోషకాహారాలు, చిరుధాన్యాలను ప్రదర్శనగా ఉంచారు. వారు మాట్లాడుతూ చిరుధాన్యాలతో కలిగే ప్రయోజనాలను వివరించారు. వానల్‌పాడ్ సర్పంచ్ రాజన్న, ద్రావ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు ప్రభావతి, వెంకటలక్ష్మి, ఏఎన్ఎం సుజాత, అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

దస్తురాబాద్: మండల కేంద్రంతోపాటు ఆకొండపేట,పేర్కపల్లె,బుట్టాపూర్ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అన్నప్రాసన,చిరుధాన్యాల ప్రాముఖ్యత వివరించారు. రాజమణి,రత్నమాల,సుగుణదేవి, కృష్ణవేణి,గీతాంజలి తదితరులు పాల్గొన్నారు.

ముధోల్: పోషణ్ పక్వాడలో భాగంగా మండలంలోని తరోడా గ్రామంలో చిరుధాన్యాలతో కలిగే ప్రయోజనాలను ఐసీడీఎస్ సీడీపీవో శ్రీమతి వివరించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ టీచర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. కేంద్రాలకు వచ్చే లబ్ధిదారులకు తప్పనిసరిగా పోషకాహారం అందించాలన్నారు.



భైంసారూరల్: మాట్లాడుతున్న ఎంపీపీ కల్పన

కడెం: పోషణ్ పక్వాడలో భాగంగా మండలంలోని కొర్రగూడెంలో గర్భిణులు, బాలింతలకు పౌష్టికాహారంపై అవగాహన కల్పించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శ్రీలత మాట్లాడుతూ బరువు తక్కువగా ఉన్న చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారించాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. కార్యక్రమంలో బెల్లాల్ సెక్టార్ అంగన్‌వాడీ టీచర్లు ఉన్నారు.

సమ్మేళనం ఏర్పాట్లు పరిశీలన

సారంగపూర్: మండలంలోని స్వర్ణ గ్రామంలో ఈనెల 4న మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి అధ్యక్షతన నిర్వహించే బీఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనం ఏర్పాట్లను శనివారం ఆ పార్టీ మండల నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ మండల కన్వీనర్ మాధవరావు మాట్లాడుతూ సమ్మేళన సభను శ్రీరాజరాజేశ్వర స్వామి కల్యాణ మండపంలో నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. కార్యకర్తలు, ప్రజలు తరలిరావాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ మండల ఇన్‌చార్జి అల్లోల మురళీధర్‌రెడ్డి, ఆలూరు పీఏసీఎస్ అధ్యక్షుడు మాణిక్ రెడ్డి, అడెల్లి ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, అబ్దుల్ హాదీ, మల్లేశ్, నాళం శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

ఆవాసంలో దుస్తులు పంపిణీ

భైంసాటౌన్: పట్టణంలోని శ్రీ వివేకానంద ఆవాసంలో పలువురు విద్యార్థులకు శనివారం బీజేపీ నియోజకవర్గ నాయకులు పవార్ రామారావ్ పటేల్ దుస్తులు పంపిణీ చేశారు. డాక్టర్ కేశవ్ బలిరాం హెడ్గేవార్ జయంతిని పురస్కరించుకుని ఆవాసంలోని బాలురకు దుస్తులు అందించారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ గంగాధర్, తూమోల్ల దత్తు, సాదం ప్రవీణ్, ఆవాసం అధ్యక్షులు శైలేశ్ మాశెట్టివార్, సహాయక్ చంద్రకాంత్, పలువురు నాయకులు తదితరులు ఉన్నారు.

సన్మానం



కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు

నిర్మల్‌టౌన్: జిల్లా కేంద్రంలోని టీఎన్జీవోస్ భవన్‌లో శనివారం జిల్లా చలనచిత్ర, టీవీ కళాకారుల అసోసియేషన్ తరఫున ‘శ్రీకారం’ షార్ట్ ఫిలిం చిత్ర యూనిట్‌ను సన్మానించారు. స్వల్పకాలంలో ప్రజాదరణ పొందినందుకు డైరెక్టర్ మేరీమాత, నిర్మాత సామిల్‌రావును శాలువా, పుష్పగుచ్ఛంతో సన్మానించారు. చలనచిత్ర టీవీ కళాకారుల అసోసియేషన్ అధ్యక్షుడు అడిచర్ల రాజు, శ్రీకారం చిత్ర కెమెరామెన్ ధనాలకోట కృష్ణవర్మ చిత్రంలో నటించిన వారిని అభినందించారు. కార్యక్రమంలో వేణుగోపాల్, కళాకారులు జోసెఫ్ బాబూరావు, ప్రభుదాస్, కోటగిరి నర్సయ్య, రాజన్న, కిరణ్, రమేశ్, సునీల్ తదితరులు పాల్గొన్నారు.

అటెన్షన్ ప్లీజ్.. కూలిపోతేనే పట్టించుకుంటారా?



తానూరు: మండలంలోని సింగన్‌గాంలో రహదారి పక్కనున్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ స్తంభాలు కుంగడంతో కూలేందుకు సిద్ధంగా ఉంది. ఏడాదిగా అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదు. దీంతో ఎప్పుడు ప్రమాదం చోటు చేసుకుంటుందోనని గ్రామస్తులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు మరమ్మతులు చేపట్టి సమస్య పరిష్కరించాలని కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

భైంసాటౌన్: భైంసా డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో డీఈ శ్రీనివాస్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. భైంసా 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల నేపథ్యంలో పట్టణంతోపాటు డివిజన్ పరిధిలోని కుభీర్, కల్లూర్, తానూర్, లోకేశ్వరం, దేగాం ఫీడర్ల పరిధిలో ఉదయం 7 నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని..వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

ముగిసిన తైబజార్ వేలం

ఖానాపూర్: పట్టణ పరిధిలో ప్రతీ ఆది, బుధవారాల్లో నిర్వహించే వారసంతలో పన్నుల వసూళ్లకు గాను చేపట్టే తైబజార్‌కు శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో వేలం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ రత్నాకర్‌రావు మాట్లాడుతూ, తైబజార్ వేలంలో కాసారపు శ్రీనివాస్‌తో పాటు దుర్గి అజయ్‌గౌడ్ వేలంలో పాల్గొన్నారని అన్నారు. ప్రభుత్వ కనీస ధర రూ.9,34,000 కాగా దుర్గిఅజయ్ రూ.5వేలు అదనంగా వేలం పాడి రూ.9.39లక్షలకు తైబజార్ దక్కించుకున్నాడని పేర్కొన్నారు. డీడీ రూపంలో ఇప్పటికే రూ.లక్ష చెల్లించాడన్నారు. 24గంటల్లోగా 50శాతం సొమ్ము చెల్లించాల్సి ఉంటుందన్నారు.

పోస్టర్ ఆవిష్కరణ

లోకేశ్వరం: ఈనెల 4న హైదరాబాద్‌లో నిర్వహించే సంఘం శరణం గచ్ఛామి నృత్య రూపకం పోస్టర్లను శనివారం మండల కేంద్రంలోని అంబేద్కర్ సంఘం మండలాధ్యక్షుడు మేడం శంకర్ ఆవిష్కరించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దళిత సంఘాల సభ్యులు హాజరవాలని కోరారు. నాయకులు శ్రీనివాస్, రమేశ్, ప్రశాంత్, దిగంబర్, భోజన్న ఉన్నారు.

రైతుబజార్‌లో..

కూరగాయలు	కిలో(రూ.లో)
టమాటా	15
వంకాయ	50
బెండకాయ	40
పచ్చిమిర్చి	60
కాకరకాయ	50
బీరకాయ	70
క్యారెట్	100
గోరుచిక్కుడు	60
కొత్తిమీర	120
అల్లం	50
ఎల్లిగడ్డ	60
ఉల్లిగడ్డ	20
ఆలుగడ్డ	20

- నిర్మల్‌టౌన్

సినిమాలు



తిరుమల : దసరా
నారాయణ: బలగం

రూట్‌మ్యాప్ పరిశీలించిన సీఐ

ఖానాపూర్: పట్టణంలో ఈనెల 4న బజరంగ్‌దళ్, విశ్వహిందూపరిషత్ ఆధ్వర్యంలో చేపట్టే వీర హనుమాన్ విజయయాత్ర రూట్‌మ్యాప్‌ను శనివారం సీఐ నారాయణనాయక్ పరిశీలించారు. ఈవిషయమై స్థానిక మండల నాయకులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. వీర హనుమాన్ విజయయాత్రను శాంతియుతంగా, భక్తిశ్రద్ధల నడుమ జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సై శంకర్, వెంకటేశ్వర్లు, సతీశ్‌రావు దేశ్‌పాండే, కాసవేణి ప్రణయ్, గంగాధర్ తదితరులు ఉన్నారు.



నాయకులతో మాట్లాడుతున్న సీఐ నారాయణ

విజయయాత్ర పోస్టర్ ఆవిష్కరణ

ఖానాపూర్: పట్టణంలో ఈనెల 4న జరిగే వీరహనుమాన్ విజయయాత్రను జయప్రదం చేయాలని బజరంగ్‌దళ్, విశ్వహిందూ పరిషత్ నాయకులు అన్నారు. శనివారం పట్టణంలో విజయయాత్రకు సంబంధించిన పోస్టర్లను నాయకులతో కలిసి ఆవిష్కరించారు. కార్యక్రమంలో కాసవేణి ప్రణయ్, శేఖర్, నవీన్, రాజేందర్, విలాస్, శ్రీకాంత్, రాజేశ్వర్, శ్యాం తదితరులు ఉన్నారు.

విజయవంతం చేయాలి..

నిర్మల్‌చైన్‌గేట్: బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో ఆదివారం జిల్లా కేంద్రంలో చేపట్టే వీర హనుమాన్ విజయయాత్ర విజయవంతం చేయాలని వీహెచ్‌పీ జిల్లా అధ్యక్షుడు పతికే రాజేందర్ అన్నారు. ఉదయం 10 గంటలకు దేవరకూడ దేవస్థానం నుంచి యాత్ర ప్రారంభం కాగా ముఖ్య వక్తగా జిన్నా సత్యనారాయణ హాజరవుతున్నారని పేర్కొన్నారు.

నర్సరీ నిర్వహణలో నిర్లక్ష్యం వద్దు

తానూరు: హరితహారం కోసం ఏర్పాటు చేసిన నర్సరీల నిర్వహణలో అధికారులు నిర్లక్ష్యంగా ఉండొద్దని ఎంపీడీవో శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలంలోని వాడవన గ్రామాన్ని ఆయన సందర్శించారు. మొలకలు ఎండిపోకుండా నీటిని అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పల్లె ప్రకృతివనం పరిశీలించారు. ఇంటింటి నుంచి సేకరించిన చెత్తను సెగ్రిగేషన్ షెడ్డుకు తరలించి సేంద్రియ ఎరువు తయారు చేయాలని కార్యదర్శి మహేశ్‌కు సూచించారు. పారిశుధ్య పనులను ఎప్పటికప్పుడు చేపట్టి వీధులు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వారి వెంట పలువురు ఉన్నారు.



ప్రకృతివనం పరిశీలిస్తున్న ఎంపీడీవో శ్రీనివాస్